# లాస్యనందితను గెలిపించండి..

## • బోయిన్‌పల్లిలో వాడవాడలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ప్రచారం

కంటోన్మెంట్, నవంబర్ 22 : బీఆర్ఎస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గ అభ్యర్థి గ్యాని లాస్యనందితకు మద్దతుగా బోయిన్‌పల్లి మార్కెట్ సమీపంలోని అంబేద్కర్‌నగర్, సౌజన్య కాలనీలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. లాస్యనందిత తరపున పార్టీ నాయకురాలు నివేదిత ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సాయన్న చొరవతో కంటోన్మెంట్‌లో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తుచేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలంతా తమ వైపే ఉన్నారని.. కంటోన్మెంట్ లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంబేద్కర్‌నగర్‌లో బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింహ ముదిరాజ్, దీనా యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణు, శ్రీనివాస్, సైదులు, గణేశ్, జైరామ్, విశ్వనాథ్, కృష్ణ, జగదీశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో భాగంగా మహిళకు పాదాభివందనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత



అంబేద్కర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్



వృద్ధుడిని కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్



సౌజన్యకాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత



అంబేద్కర్‌నగర్‌లో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్

# లాస్య గెలుపు లాంఛనమే..

## • బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్

కంటోన్మెంట్, నవంబర్ 22 : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజల దీవెనలతో బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత 50 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ రోడ్ షోకు వేలాదిమంది స్వచ్ఛందంగా తరలివచ్చారని.. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ ఎంత బలంగా ఉందో చెప్పడానికి ఈ రోడ్‌షో సక్సెస్సే నిదర్శనమన్నారు. బుధవారం కార్ఖానాలోని దివంగత ఎమ్మెల్యే సాయన్న నివాసంలో ఎంఎన్ శ్రీనివాస్ బర్త్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యుడు పాండుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కేటీఆర్ రోడ్‌షోతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

కంటోన్మెంట్, నవంబర్ 22 : ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని అన్నానగర్, పికెట్ చౌరస్తాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్ షో సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత, ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని బొల్లారం, తిరుమలగిరి, కార్ఖానా, మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, రసూల్‌పురా, సీతారాంపురం, తాడ్‌బండ్, మోండా డివిజన్ల నుంచి రోడ్‌షోకు భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. మహిళలు సైతం పెద్ద ఎత్తున రోడ్ షోకు హాజరయ్యారు. రోడ్‌షో సందర్భంగా అన్నానగర్‌చౌరస్తా జనసంద్రంగా మారింది. దివంగత ఎమ్మెల్యే సాయన్న చేసిన అభివృద్ధితో పాటు ఇంటి ఆడబిడ్డగా లాస్యనందితను ఆశీర్వదించాలని మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు జనం నుంచి మద్దతు లభించింది.



అన్నానగర్‌లో మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు భారీగా హాజరైన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు(ఫైల్)

కంటోన్మెంట్‌లోని సివిల్ ప్రాంతాలను జీహెచ్ఎంసీలో కలిపితేనే అభివృద్ధి నిరాటంకంగా సాగుతుందని చెప్పడంతో బీఆర్ఎస్ పార్టీకి మరింత మైలేజ్ రానుందని పలువురు పేర్కొంటున్నారు. కేటీఆర్ రోడ్‌షోతో బీఆర్ఎస్‌కు కంటోన్మెంట్‌లో మరింత ఊపు వచ్చింది.

### లాస్యనందిత హర్షం..

కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ రోడ్ షో సూపర్ సక్సెస్ కావడంపై ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత హర్షం వ్యక్తం చేశారు. రోడ్ షోకు తరలివచ్చిన బోర్డు సభ్యులు, సీనియర్ నాయకులు, గులాబీ క్యాడర్, ఉద్యమకారులు, మహిళా నేతలు, అనుబంధ సంఘాల సభ్యులు, దివంగత ఎమ్మెల్యే సాయన్న అనుచరులు, అభిమానులు, కార్యకర్తలందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## లాస్యనందితకు జైన్ సమాజ్ మద్దతు



ఈస్ట్‌మారేడ్‌పల్లిలోని తాతేడ్‌భవన్‌లో లాస్యనందితకు మద్దతు తెలుపుతున్న జైన్‌సమాజ్ ప్రతినిధులు, పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్

మారేడ్‌పల్లి, నవంబర్ 22: బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి జి. లాస్యనందితకు జైన్ సమాజ్ ప్రతినిధులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈస్ట్ మారేడ్‌పల్లిలోని జైన్ సమాజ్ ప్రతినిధులు బుధవారం తాతేడ్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ అభ్యర్థి జి. లాస్యనందిత, ఎమ్మెల్సీ బొగ్గారాపు దయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దయానంద్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉందని, అన్ని మతాల పండుగలకు సమప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. మూడో సారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ కావడం ఖాయమన్నారు. అనంతరం జైన్ సమాజ్ ప్రతినిధులు గాంధీ, రమేశ్‌గాంధీ, మహావీర్ తాతెడ్‌జీ, మహిళ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, చొల్లేటి రమేశ్ తదితరులు పాలొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి

### • బీఆర్ఎస్ నాయకుడు ముప్పిడి గోపాల్



బాలంరాయిలో లాస్యనందితను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముప్పిడి గోపాల్

కంటోన్మెంట్, నవంబర్ 22 : బీఆర్ఎస్ పార్టీతోనే కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ముప్పిడి గోపాల్ స్పష్టం చేశారు. మూడో వార్డులోని బాలంరాయిలో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో ఇప్పటికే నియోజకవర్గాన్ని దివంగత ఎమ్మెల్యే సాయన్న అన్ని రంగాల్లో తీర్చిదిద్దారని అన్నారు. ప్రజలు గమనించి సాయన్న కూతురు, బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణ రాక ముందు ఉన్న దుర్భత స్థితిని, వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ప్రచారంలో నర్సింగ్‌రావు, రేణుక, లావణ్య, కనకమ్మ, లక్ష్మి, సత్యమ్మ, శైలజ, కొమరమ్మ, వేణు, సాయి, హన్మంతు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు- గుంతకల్ స్టేషన్ల మధ్య రైల్వే డబ్లింగ్ పనులు పూర్తి

సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో గుంటూరు-గుంతకల్ రైల్వే లైన్ డబ్లింగ్‌లో భాగంగా మల్కాపురం-ధోనె మధ్య 11.2 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసినట్లు బుధవారం రైల్వే అధికారులు వెల్లడించారు. ఆ మార్గంలో విద్యుద్దీకరణ పనులు కూడా చేపట్టినట్లు చెప్పారు. దాంతో గుంటూరు- గుంతకల్ సెక్షన్ మధ్యలో మొత్తం 60 కిలో మీటర్ల వరకు రైల్వే డబుల్ లైన్ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఏపీ, రాయలసీమ ప్రాంతాల ప్రయాణికులకు సమయం బాగా తగ్గుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

## చిన్నారుల మానసికోల్లాసానికి ఆటలు దోహదం

### • ఈస్ట్‌జోన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి

అడ్డగుట్ట, నవంబర్ 22 : చిన్నారుల మానసికోల్లాసానికి ఆటపాటలు ఎంతగానో దోహదపడతాయని ఈస్ట్‌జోన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. మెట్టుగూడలో కిడ్స్ ప్లే షోరూమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులకు చదువుతో పాటు ఆటపాటలు కూడా అవసరమని, అప్పుడే శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సహన ట్రెడింగ్ కిడ్స్ ప్లే సీఈఓ భాగ్యసుబ్రహ్మణ్యనాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఈశ్వరయ్య, తిరుపతి, లాలాగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధులత, తదితరులు పాల్గొన్నారు.